క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ


ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎస్ఐగా పి.నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో కురుపాంలో ఎస్ఐగా పనిచేసిన షణ్ముఖరావుకు మాడుగులకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న నారాయణరావును ఎస్పీ మాధవరెడ్డి నియమించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని, ప్రజలంతా సహకరించాలని కోరారు.

మూలకు చేరిన సోలార్ రక్షిత పథకం


పాడైన సోలార్ రక్షిత పథకం

సీతంపేట: మండలంలోని గెడ్డగూడ సోలార్ రక్షిత పథకం మూలకు చేరింది. దీంతో తాగునీటిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 13 కుటుంబాలున్నాయి. గ్రావిటీ పథకం ఉన్నప్పటికీ బురద నీరు రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరగబెట్టుకుని తాగాల్సి వస్తోందని సర్పంచ్ గంగాధర్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సోలార్ పథకానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ రాంబాబు


ప్రధాన మార్కెట్‌లో వర్తకులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాహనచోదకులు నిబంధనలు పాటించాలని డీఎస్పీ రాంబాబు అన్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం రాత్రి ట్రాఫిక్ నిబంధనల అమలు తీరును పరిశీలించారు. విశాఖ, వీరఘట్టం నుంచి వచ్చే వాహనాలు అన్నవరం మీదుగా పట్టణంలోకి వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. కోటదుర్గమ్మ దేవస్థానం పరిసరాల్లో దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను నిర్ధేశిత పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపేలా వ్యాపారులు చెప్పాలని సూచించారు. అలాగే అనుమానితుల కదలికలను గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎస్పీ వెంట సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై కె.ప్రయోగమూర్తి, తదితరులున్నారు.

బస్‌పాస్‌ల వెబ్‌సైట్ నిలుపుదల

పాలకొండ రూరల్: ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ రకాల బస్ పాసుల నిర్వహణకు సంబంధించి వినియోగంలో ఉన్న www.aprrtcparr.in వెబ్‌సైట్ ఈనెల 5, 6 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు తేదీల్లో సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరిస్తారని పేర్కొన్నారు. మళ్లీ 7వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్ల వద్ద పాస్‌లు రెన్యువల్, మంజూరు చేస్తామన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

పార్వతీపురం: ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని సీఐటీయూ, సీపీఎం నాయకులు వై.మన్మథరావు, ఆర్.వేణు అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం మూడో రోజు ఉచిత ఇసుక సరఫరాపై నిరసన దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినప్పటికీ ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయకపోవడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు అధిక ధరలను వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు.

జిల్లాలో 100కిలోమీటర్లు పైగా దూరంగా ఉన్న భామిని మండలంలోని కాట్రగడ్డ వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తే పార్వతీపురం పరిసర గ్రామాలకు ఇసుక ఎలా తెచ్చుకోవాలని వారు ప్రశ్నించారు. ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటరమణ, దిలీప్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి

సీతానగరం: వరిలో ఆశించిన తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా లచ్చయ్యపేట గ్రామంలో వరి చేను పంటను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం వరి చేను పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలను వివరించారు. వ్యవసాయ సహాయకులు, లచ్చయ్యపేట, గుమ్మిడివరం రైతులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిస్తున్న కోటదుర్గమ్మ


గుమ్మలక్ష్మీపురం: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న స్థానికులు


పాలకొండ: మాలధారణ కార్యక్రమంలో భక్తులు


వీరఘట్టం: కిమ్మి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం

జయహో దుర్గమ్మ..

- వాడవాడలా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- మండపాల్లో ప్రత్యేక పూజలు చేపట్టిన భక్తులు


వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న వీరఘట్టం కోటదుర్గతల్లి


వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: మండలంలోని దోనుబాయి, దారిమల్లి, సీతంపేటలో గల దుర్గాదేవి, మల్లెమ్మతల్లి, సంతోషిమాత ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పందిర్రాట వేసి కలశస్థాపన, అఖండ దీపారాధన, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మాలధారణ..

పాలకొండ: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో పలువురు భక్తులు భవానీ మాలధారణ వేశారు. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో దీక్ష చేపట్టనున్నారు. సుమారు రెండు వందల మంది దీక్ష తీసుకున్నట్లు అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తెలిపారు.

పోటెత్తిన భక్తులు..

వీరఘట్టం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం, భక్తుల పాలిట కల్పవల్లి కోటదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో 111 మంది భవానీ, సంతోషమాత భక్తులు దీక్షలు చేపట్టారు. వీరికి శర్మయాజీ మాలధారణ చేశారు. సాయంత్రం దేవీ దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కిమ్మి గ్రామంలో నాగావళి నదీతీరంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి, పలువురు మాలలు వేశారు. ఈ సందర్భంగా శర్మయాజీ మాట్లాడుతూ, శరన్నవరాత్రుల్లో దేవీ దర్శనం చేసుకుంటే శుభం కలుగుతుందని చెప్పారు.

భామినిలో..

భామిని: మండలంలోని బత్తిలి, కొరమ గ్రామాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. బత్తిలి కోటదుర్గమ్మకు ఎస్సై కాంతారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కొరమలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సర్పంచ్ అగతముడి నీలవేణి, మాజీ సర్పంచ్ అగతముడి రఘు, తదితరులు పాల్గొన్నారు.


భామిని: కొరమలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం

బాలత్రిపుర సుందరిగా...

పాలకొండ రూరల్: దసరా ఉత్సవాలు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నీలమాంబ ఆలయం, నాగవంశపువీధి కూడలిలోని పురటాళ్ల పోలమాంబ ఆలయం, నక్కలపేటలోని జ్ఞాన సరస్వతీ దక్షిణాముఖ ఆంజనేయ ఆలయ ప్రాంగణంలో గల అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరుని మండపంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లకు పూజలు చేపట్టారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.


గరుగుబిల్లి: రావివలసలో అమ్మవారి ఊరేగింపు


సీతంపేట: సంతోషిమాత ఆలయం వద్ద పందిర్రాట వేస్తున్న అర్చకులు సాయికృష్ణశర్మ, భక్తులు

నేడు ధర్నా


మాట్లాడుతున్న సీఐటీయూ, రైతు సంఘ నాయకులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని నెరవేర్చకపోవడంతో భవన నిర్మాణ కార్మికులతో పాటు వివిధ రంగాలకు చెందిన కార్మికులు అవస్థలు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉచిత ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ రంగ, అనుబంధ కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈనెల 4వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు, వ్యవసాయకార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ నాయకులు డి. రమణారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వరిని ఆశించిన తెగుళ్లు


పాముపొడ తెగులు సోకిన వరి

గరుగుబిల్లి: ఖరీఫ్ వరిపై తెగుళ్ల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ ఆర్.విజయభారతి అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉల్లిబద్ర తదితర గ్రామాల్లో పర్యటించి వరి పంటను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను సాగు చేసే రైతులు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి పంటపై ప్రస్తుతం అగ్గి తెగులు, పాముపొడ తెగులు ఆశిస్తున్నాయని తెలిపారు.

దీని వల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

రహదారి సౌకర్యం కల్పించండి


సబ్‌కలెక్టర్‌కు సమస్యలు నివేదిస్తున్న ఎంపీపీ, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని అద్దలి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఎంపీపీ బొమ్మాళి భాను కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని గురువారం కలసి సమస్యలను వివరించారు. దీర్ఘకాలంగా గ్రామానికి పూర్తిస్థాయి రహదారి లేకపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలను తెలియజేశారు. అలాగే లుంబూరు, పెదకోటిపల్లి రోడ్డు నిర్మాణం, పాలకొండ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

పార్వతీపురం టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని, జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతూ రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే కనీసం వైద్య పరీక్షలు కూడా నిర్వహించకుండా మందులు రాసిచ్చి ప్రైవేటు దుకాణాల్లో తీసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. గిరిజనుల ప్రాణాలంటే వైద్య సిబ్బందికి లెక్కలేదా? అని ప్రశ్నించారు. తప్పని పరిస్థితుల్లో గిరిజనులు ఆర్ఎంపీలను ఆశ్రయించి రక్త పరీక్షలు చేసి, రూ.వేలల్లో ఖర్చు చేసి, ఆర్థికంగా, ఆరోగ్యంగా చితికి పోతున్నారని తెలిపారు. వెంటనే పీహెచ్‌సీల్లో జ్వరాలకు మందులు అందుబాటులో ఉంచి, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దోమతెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలంలో సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి గురువారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు


వరద పాయసం పోస్తున్న మహిళలు

భామిని: మండలంలో సరిపడా వర్షాల్లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో వరుణుడి కరుణ కోసం గురవారం ప్రత్యేక పూజలు చేశారు. వడ్డంగిలో రైతులు కప్ప పండుగ చేసి కొండదేవతకు వరద పాయసం పోశారు. మహిళలు ఊరేగింపుగా కొండ పైకి చేరి పూజలు చేశారు.

కురుపాం కోటలో దసరా ఉత్సవాలు


కురుపాం కోటలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్, కుటుంబ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): రానున్న దసరా పండగ నేపథ్యంలో కురుపాం కోటలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కుటుంబ సభ్యులు ప్రీతీదేవి, శృతీదేవిలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా దసరా సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా కోట దుర్గమ్మకు, ఆయుధాలకు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తామని తెలిపారు. పూజల్లో స్థానికులు పాల్గొన్నారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్ల సీజ్


ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకున్న రెవెన్యూ అధికారులు

వీరఘట్టం: మండలంలోని యు.వెంకంపేట గ్రామ సమీపంలో మరియగిరి కొండపైన అక్రమంగా కంకర తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ గురువారం తెలిపారు. సీజ్ చేసిన వాటిని పోలీసులకు అప్పగించి ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

రహదారులను పూర్తి చేయండి..


మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు అప్పారావు, తదితరులు

సీతంపేట: అర్ధంతరంగా నిలిచిన రహదారుల పనులను పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు బి. అప్పారావు, పి. సాంబయ్య, తదితరులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ... పాలమానుగూడ, వంబరెల్లి, ముత్యాలు, ద్వారబందం గ్రామాల రహదారులు పనులు పూర్తికాలేదన్నారు. అలాగే పూతికవలస, పెదకంబ, దారబ, శంబాం గ్రామాలకు వేసిన రహదారుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, దుర్గారావు పాల్గొన్నారు.


గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


పైరును పరిశీలిస్తున్న ఏఓ శ్రీదేవి, తదితరులు

సీతంపేట: మండలంలోని పనసగూడ, కె.గుమ్మడ గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ... పంటల్లో వచ్చే తెగుళ్లు, నివారణా చర్యలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనుబంధ శాఖల వీఏఏలు పాల్గొన్నారు.

వీరఘట్టం బీసీ కాలనీకి గ్రహణం

- 1984లో ఏర్పడిన బీసీ కాలనీ
- తమ ఇళ్లపై సొంత హక్కులు లేని కాలనీవాసులు
- క్రయ,విక్రయాలకు నోచుకోని 450 మంది గృహవాసులు


వీరఘట్టం బీసీ కాలనీ

వీరఘట్టం:

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అతిపెద్ద మేజరు పంచాయతీ వీరఘట్టం. ప్రస్తుతం పార్వతీపురం మన్యంలో సుమారు 20 వేల మంది జనాభా కలిగిన వీరఘట్టం మేజరు పంచాయతీలో బీసీ కాలనీ ఒక భాగం. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో అప్పటి వీరఘట్టం సమితి ప్రెసిడెంట్ పాలవలస రాజశేఖరం, గ్రామ పెద్ద దిబ్బ జోగులు మాస్టారు సంకల్పంతో వీరఘట్టంలో బీసీ కాలనీ ఏర్పడింది. ఇళ్లులేని నిరుపేదలైన బీసీ సామాజిక వర్గానికి ఇళ్ల స్థలాలలను కేటాయిస్తూ బీసీ కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 200 మందికి ఒకొక్కరికి 2 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తూ బీసీ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇలా దశల వారీగా ఇళ్ల స్థలాలను కేటాయించడంతో ప్రస్తుతం బీసీ కాలనీలో సుమారు 450 మంది గృహవాసులు ఉన్నారు. బీసీ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్నా తమ ఇళ్లపై సంపూర్ణ హక్కు పత్రాలు లేకపోవడంతో కాలనీ వాసులు సతమతమౌతున్నారు. ఇక్కడ ఉన్న ఇళ్లు అమ్ముదామన్నా, లేదా ఎవరి ఇళ్లైనా కొందామన్నా క్రయ, విక్రయాలకు నోచుకోక బీసీ కాలనీవాసులు సతమతమౌతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి బీసీ కాలనీ వాసులకు తమ ఇళ్లపై సంపూర్ణ హక్కులు కల్పించాలని వీరంతా కోరుతున్నారు.

బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నాం



మానాన్న పేరు మీద 2 సెంట్లు స్థలంలో 40 ఏళ్ల క్రితం ఇల్లు కట్టించి ఇచ్చారు. ఆయన కొంత కాలం క్రితం చనిపోయారు. ఈ ఇల్లు అమ్ముదామన్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వీరఘట్టంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బీసీ కాలనీ ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు జరగక ఇక్కడ ఇళ్ల ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి బీసీ కాలనీ వాసులకు సంపూర్ణ హక్కులు కల్పించాలి.

– బి.సాయికృష్ణ, బీసీ కాలనీ, వీరఘట్టం

ఇల్లు ఉన్నా..



1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇచ్చారు. పదేళ్ల తర్వాత ఇంటి పన్నులు వేసి గత 30 ఏళ్లగా ఇంటి పన్నులు వసూళ్లు చేస్తున్నారు. అయినా ఇంత వరకు మా ఇంటిపై హక్కు పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎవరైనా ఇళ్లు అమ్ముదామన్నా, కొందామన్నా పెద్ద మనుషులతో స్టాంప్ పేపర్‌పై రాతకోతలు తప్ప రిజిస్ట్రేషన్ జరగడం లేదు.

– రౌతు అప్పలనాయుడు, బీసీ కాలనీ, వీరఘట్టం